క్లుప్తంగా

డీసీపీ విచారణ



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో భూ సమస్యపై వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్ల కర్ణాకర్ విచారించారు. గ్రామానికి చెందిన చిన్న శ్రీనివాస్ వారసత్వంగా వచ్చిన 32గుంటల పొలాన్ని పెద్ద శ్రీనివాస్‌కు విక్రయించి హైదరాబాద్‌కు వెళ్లి జీవిస్తున్నాడు. దాని పక్కనే ఉన్న మరో 8గుంటల స్థలాన్ని పెద్ద శ్రీనివాస్ అతడి భార్య స్వరూప ఆక్రమించుకున్నారని ఇటీవల కమిషనర్‌కు చిన్న శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దీంతో పొలం వద్దకు వెళ్లి డీసీపీ విచారణ చేపట్టారు. ఆయన వెంట ఏసీపీ సంపత్‌రావు, సీఐలు సూర్యప్రసాద్, పులి రమేష్, ఎస్సై తిరుపతి, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయిని పహాడ్ గ్రామానికి చెందిన దూసరి శౌరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఇదే గ్రామానికి చెందిన ఆదర్శ యూత్ సేవా సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మంగళవారం రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పుట్టువెంట్రుకల వేలం

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర సందర్భంగా సేకరించిన పుట్టు వెంట్రుకల వేలం పాటను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శేషగిరి తెలిపారు. ఆసక్తి గల వారు ఆలయం వద్దకు ఉదయం 11గంటలకు రావాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గీసుకొండ : మండలంలోని బొడ్డుచింతలపెల్లిలో కాపీ ఈశ్వరయ్యకు చెందిన పాడిగేదె విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందింది. మేతకు వెళ్లిన గేదె త్రీఫేస్ వైర్లను తగలడంతో కరెంటు షాక్‌తో మృతి చెందింది. గేదె మృతితో రైతుకు రూ. 50 వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్, కేదాసి మోహన్, నరేశ్ డిమాండ్ చేశారు.

సందర్శన

వరంగల్ (పర్వతగిరి) : మండలకేంద్రంలోని చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహాన్ని ఎస్సై దేవేందర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులతో విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ మెట్లు, ఇతరాత్ర సమస్యలను తెలుసుకుని త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తానని తెలిపారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

చెన్నారావుపేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కామగోని వంశీ-దీపికల కుమారుడు విలోహిత్ జన్మదినం సందర్భంగా పరీక్ష ప్యాడ్స్, పలకలు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తప్పెట రమేష్, హెచ్‌ఎం లడె రవీందర్, రవి, గంగాధర్, బ్రహ్మచారి, సూరయ్య, నరేందర్, నిమ్మనబోయిన రాజు, తప్పెట అఖిల్, కంకల శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

సంగెం : నిరంతరం పుస్తక పఠనం ద్వారా విజ్ఞాన సంపదను పెంపొందించుకోవచ్చని నెహ్రూ యువ కేంద్రం అకౌంట్ ఆఫీసర్ బానోత్ దేవిలాల్ అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రంథాలయ ఆవరణలో శ్రమదాన్ శిబిర్‌లో భాగంగా మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టారు. మంగళవారం మరుగుదొడ్డిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత పుస్తక పఠనం పట్ల ఆసక్తి చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంపల్లి దిలీప్‌రావు, వలంటీర్లు వెల్గొండ సురేష్, గాలి భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి వంశీ తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు తీర్చేందుకు క్లస్టర్ల పెంపు



రైతు వేదిక పెద్దకొర్పోలు



దీక్షకుంటలో పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ రంజిత్ (ఫైల్)

నెక్కొండ : రైతులకు వ్యవసాయ సూచనలు, సలహాలు అందించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం సాగు విస్తీర్ణం మేరకు క్లస్టర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. గతంలో ఉన్న సాగు భూమి లెక్కల ఆధారంగా ఐదువేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. ప్రభుత్వం సాగు నీటి వసతి కల్పించడం, పెట్టుబడి సాయం అందించడంతో గతంతో పోలిస్తే విస్తీర్ణం భారీగా పెరిగింది. కానీ క్లస్టర్లను పెంచకపోవడం, సిబ్బందిని నియమించకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ(ఏఈఓ) అధికారులకు పనిభారం పెరిగింది. అదనంగా వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల వారిగా గతంలో సాగయ్యే విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకోని 59క్లస్టర్లను ఏర్పాటుచేసింది. జిల్లాలో మూడు లక్షల ఎనిమిది వందల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. రైతులకు సంక్షేమ పథకాలు చేరడానికి ప్రభుత్వం క్లస్టర్ల వ్యవస్థను ఏర్పాటుచేసి సిబ్బందిని సైతం నియమించి, రైతు వేదికను నిర్మించారు. రైతు బంధు, రైతుబీమా తదితర పథకాలు, పంటల సమగ్ర సర్వే ఇతర పనులు క్లస్టర్ పరిధిలో వ్యవసాయ విస్తరణ అధికారుల విధులు.. ప్రతి రోజు క్లస్టర్ పరిధిలో ఉండే గ్రామాలను సందర్శించి అవగాహన కార్యక్రమాలు, సాగు సలహాలు, సూచనలు చేయాల్సి ఉంటుంది. ప్రారంభంలో రెవెన్యూ లెక్కల ఆధారంగా క్లస్టర్ల ఏర్పాటుచేశారు. రైతుల వారిగా ఏ పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారనే సమాచారం సేకరించడంతో జిల్లాల వారిగా సాగు లెక్కలు పక్కాగా తేలాయి. ఈ లెక్కన అవసరమైన చోట అదనంగా క్లస్టర్‌ను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

5వేలకు పైబడిన చోట ఇబ్బందులు..

పట్టా, పోడు, ఇతర భూములను కూడా పరిగణలోకి తీసుకుంటే కొంతమంది ఏఈఓల పరిధిలో 5వేల నుంచి పదివేల ఎకరాల వరకు దాటుతోంది.దీంతో రైతుల వారిగా సమగ్ర సర్వే, వానాకాలం, యాసంగి సీజన్ల వారిగా సర్వే చేయాల్సి ఉంది. కొంత మంది వేల ఎకరాలు ఉండడంతో పని భారం ఎక్కువ అవుతోందని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల వారిగా సాగుచేసే పంటల వివరాలను పంట పొలాల వద్దకు వెళ్లి ట్యాబ్‌లో నమోదు చేయాల్సి వస్తోంది. రైతు బంధు దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదుచేయాలి. రైతుబీమాలో భాగంగా బీమా పరిహారం ఉండేలా చూడాలి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఖాతాలో రైతులకు డబ్బులు రాకపోతే పరిశీలించి పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాల రైతులను ధ్రువీకరించాలి. పంట కోత ప్రయోగాలు నిర్వహించి రైతులకు అండగా నిలువాల్సి వస్తోంది.

చిరుధాన్యాల వినియోగంపై అవగాహన



ఖానాపురం: చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మాధవి



చెన్నారావుపేట : చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్న టీచర్లు

ఖానాపురం : ప్రతీ ఒక్కరు చిరుధాన్యాలు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో మంగళవారం చిరుధాన్యాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ చిరుధాన్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొర్రలు, ఉదలు, అరికెలు, రాగులు, జొన్నల వంటి చిరుధాన్యాలను ప్రతీ రోజు ఆహారంగా తీసుకోవాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మౌలాల్, రవి, సురేష్, సునీత, అంగన్‌వాడీ టీచర్లు యశోద, దేవేంద్ర, వెంకటలక్ష్మి, సునీత, రాణి, మాధవి, హైమ, తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై..

చెన్నారావుపేట : మండలంలోని జల్లీ, ఈర్య తండాలో గ్రామంలో మంగళవారం పోషణ పక్వాడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, వంటల పోటీలు తల్లులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ప్రదర్శన నిర్వహించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. అనంతరం పోషణ పక్వాడాపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ విద్య, డాక్టర్ రామ్‌నాయక్, ఏఎన్‌ఎం ఫ్రాన్సిస్కా, వీఓ అధ్యక్షుడు వర్థెల్లి స్వరూప, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, బండారి సరోజన, రమ, రజిత, ఆశ వర్కర్లు, కందిక సుశీల, తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



నర్సంపేట రూరల్: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పార్వతమ్మ



రాయపర్తి: ఆర్అండ్ఆర్ కాలనీలో..



కంటి పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

నర్సంపేట రూరల్ : కంటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలను తీసుకొచ్చిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గుంటూరుపల్లి సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ అన్నారు. నర్సంపేట మండలంలోని గుంటూరుపల్లి గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ పార్వతమ్మ మంగళవారం ప్రారంభించారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి అజయ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రాలను కాపాడుకోవాలి

రాయపర్తి : నేత్రాలను కాపాడుకోవాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ తెలిపారు. మండలంలోని ఆర్అండ్ఆర్‌కాలనీ గ్రామంలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ చెడుపాక కుమారస్వామి, టీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాగపురి సోమయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు జగన్, చెడుపాక ఎల్లయ్య, వైద్యాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రమేష్ (ఫైల్)

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్ శివారు చంద్రుతండాకు చెందిన నున్సావత్ రమేష్(32) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్సై తోట మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చంద్రుతండాకు చెందిన రమేష్ కూలి పనులు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నాడు. తండాలో చేసిన అప్పుల భారం ఎక్కువైంది. దీంతో మనోవేదనకు గురయ్యాడు. కాగా ఈ నెల 25న ఇంట్లో భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రమేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య మంగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సర్వేకు రైతులు సహకరించాలి



చెన్నారావుపేట : వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను సర్వే చేస్తున్న వ్యవసాయ అధికారులకు రైతులు సహకరించాలని ఎంపీటీసీ పసునూటి రమేష్, ఏఈఓ వినయ్ కోరారు. ఈ మేరకు మండలంలోని లింగాపురం గ్రామంలో పంటలను మంగళవారం సర్వే చేసి నివేదికలను తయారు చేశారు. వీఆర్ఏ అశోక్, నాయకులు ఉన్నారు.

6న వీర హనుమాన్ విజయయాత్ర



నర్సంపేట: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ నాయకులు



దుగ్గొండి: ముస్తాబైన నాచినపల్లి రామాలయం

నర్సంపేట : నర్సంపేటలో ఏప్రిల్ 6వ తేదీన వీర హనుమాన్ విజయయాత్ర నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ మల్యాల రవి తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం వీర హనుమాన్ విజయయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ శోభాయాత్ర నర్సంపేట అయ్యప్పస్వామి దేవాలయం నుంచి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంతో ప్రారంభమై సర్వాపురం హనుమాన్ దేవాలయం వద్ద హారతితో ముగుస్తుందని తెలిపారు. వీర హనుమాన్ శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నర్సంపేట డివిజన్ ఉపాధ్యక్షుడు చొల్లేటి జగదీశ్వర్, హనుమాన్ గురుస్వామి సారంగపాణి, రాజిరెడ్డి, అఖిల్, హనుమాన్ భక్తులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తి

దుగ్గొండి : ఈనెల 30న నిర్వహించనున్న సీతారాముల కళ్యాణానికి మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నాచినపల్లి గ్రామంలో సీతారామచంద్రస్వామి ఆలయం, కేశవాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం, మల్లంపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయం, ముద్దునూరు శివరామాలయం, అడవిరంగాపురం, దుగ్గొండి గ్రామాలలో హనుమాన్ దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు. ఆయా గ్రామాలలోని ఆలయాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ బాధ్యులు, అర్చకులు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్, డ్రైవర్



వీరారెడ్డికి సెల్‌ఫోన్ అందజేస్తున్న డ్రైవర్, కండక్టర్

నర్సంపేట : నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్, డ్రైవర్ వారు విధులు నిర్వహిస్తున్న బస్సులో పోగొట్టుకున్న విలువైన సెల్‌ఫోన్‌ను మంగళవారం డిపో సెక్యూరిటీ విభాగానికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. నర్సంపేట డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సులో డ్రైవర్ రంగయ్య, కండక్టర్ సుమీల విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ధర్మారావుపేట నుంచి నర్సంపేట వైపు వస్తున్న బస్సులో ఓ ప్రయాణికురాలు బుధరావుపేటలో ఎక్కి ఖానాపురంలో దిగిపోతూ తను కూర్చున్న సీట్లోనే సెల్‌ఫోన్ మరిచిపోయింది. సెల్ ఫోన్‌ను గుర్తించిన కండక్టర్ సుమీల విషయం డ్రైవర్ రంగయ్యకు తెలిపింది. అప్పుడే ఆ సెల్‌ఫోన్‌కు సంబంధించిన వారు ఫోన్ చేయగా బుధరావుపేటకు చెందిన చింతపెల్లి వెంకన్న కుటుంబ సభ్యులుగా గుర్తించి సెల్‌ఫోన్‌ను డ్రైవర్, కండక్టర్ డిపో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

వరంగల్(పర్వతగిరి) : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై సమన్వయ కమిటీలు గ్రామ ప్రజలతో చర్చించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సూచించారు. ఈ మేరకు పర్వతగిరి మండల సమన్వయ కమిటీతో హనుమకొండ హంటర్ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయ కమిటీ మండలంలో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి



ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పార్లమెంటు సమావేశాల్లో ఆదాని గురించి ప్రశ్నించినందుకు సభ్యత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ నర్సంపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షను ఉద్దేశించి మాధవరెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని దోచుకుంటున్న విధానంపై పార్లమెంటులో రాహుల్‌గాంధీ మాట్లాడినందుకు కుట్రతో లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసిందని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబాన్ని మోదీ ప్రభుత్వం అవమానించడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. దీక్షకు మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్, తుమ్మలపల్లి సందీప్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, ఎర్రల్ల బాబు, శాఖమూరి హరిబాబు, బక్కి అశోక్, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు

జీవితాంతం కేసీఆర్‌కు సైనికుడిగానే పనిచేస్తా..

ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



దుగ్గొండి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది

దుగ్గొండి : తాను జీవించి ఉన్నంత కాలం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సైనికుడిగానే పనిచేస్తానని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రతి కార్యకర్త రాష్ట్ర శ్రేయస్సు కోసం బీఆర్ఎస్‌కు అండగా నిలవాలన్నారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో తిమ్మంపేట, మహ్మదాపురం, మల్లంపల్లి, ముద్దునూరు ఎంపీటీసీల పరిధిలోని గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం గొల్లపల్లిలోని గుప్తా వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దుగ్గొండి మండల ప్రజల ఆశీర్వాద బలంతో తాను ఎమ్మెల్యేగా గెలుపొందనన్నారు. ప్రతిఫలంగా మండలంలో ఏనాడు చేయని విధంగా అత్యధికంగా అభివృద్ధి నిధులు తెచ్చి పనులు కొనసాగిస్తున్నామన్నారు. రైతులు వడగళ్లతో నష్టపోతే ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి పరిశీలించి ఎకరాకు రూ.10వేల పరిహారం మంజూరు చేశారని గుర్తుచేశారు. గ్రామాలలో ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలను ఐక్యతగా ఒకే వేదికపైకి తీసుకురావడానికే ఆత్మీయ సమ్మేళనం అని అన్నారు. ఈ సందర్భంగా తిమ్మంపేట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ది సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

నాయకులకు చురకలు..

మండల, గ్రామస్థాయి నాయకుల మధ్యన విభేదాలు ఉండటం, ఐక్యత లేక పార్టీకి తీరని నష్టం జరుగుతోందన్నారు. సమస్యలు, అభిప్రాయ భేదాలు ఉంటే కలిసి కూర్చుని మాట్లాడుకోవాలని హితువు పలికారు. ప్రతి పక్షాల చేసే అసత్య ఆరోపణలను మంచి విషయ పరిజ్ఞానంతో తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పీఏసీఎస్ చైర్మన్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాల పార్టీ బాధ్యులు పాల్గొన్నారు.


కంఠమహేశ్వరస్వామి మహోత్సవం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం కంఠమహేశ్వర స్వామి మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి మహిళలు బోనాలతో రేణుక ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లి ఎల్లమ్మతల్లిని కొలిచారు. ఈవేడుకలకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గోడిశాల మమతసదానందం, పీఏసీఎస్ చైర్మన్ ఆకుల రమేష్, ఎంపీటీసీ బండారి శ్రీలతరమేష్, గౌడ సంఘం బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

31న ఆత్మీయ సమ్మేళనం

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ క్లస్టర్‌లో ఈనెల 31న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు అమీనాబాద్ రైతు వేదిక సమీపంలో ఆత్మీయ సమ్మేళనానికి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థలం పరిశీలించడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరవుతారని అన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం




సంగెం: స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

వరంగల్ (పర్వతగిరి) : మండల కేంద్రంలోని విశ్వజెనిత్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఉపాధ్యాయ పాత్ర పోషించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎర్రబెల్లి హరికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువలతో కూడి, సమాజంలో గౌరవించబడుతుందని తెలిపారు. 35మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించగా డీఈఓగా జె.చరణ్, ఎంఈఓ బి.తులసిరామ్, ప్రిన్సిపాల్‌గా బి.లక్ష్మణ్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగెంలో..

సంగెం : మండల కేంద్రంలోని రవిచంద్ర హైస్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా అభినయించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. డీఈఓగా భారతి, ఎంఈఓగా శ్రీజ, ప్రిన్సిపాల్‌గా స్పందనలతో పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కాసం చంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కీర్తినగర్‌లో రూ.50 లక్షలతో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో మహిళా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ సుంకరి మనీషాశివకుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి కృషితో కమ్యూనిటీ హాల్ మంజూరైందని పేర్కొన్నారు. మెప్మా సీఓ రజిత, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోగుల సంజీవ, ప్రధాన కార్యదర్శి కక్కెర్ల రవితేజ, గోరుకంటి లక్ష్మణ్‌రావు, మెండు కమలాకర్, వెంకటేశ్వర్లు, కొండ రాధ, సట్ల గీతారాణి, ఇందిరమ్మ, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.